ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 20 జనవరి 2025

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ధర్మపురి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని 3, 7, 11, 12 వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఈ నెల 20న సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలిసి శంకుస్థాపన చేస్తారని టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో సుమా రు 10 కోట్లు టీయుఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టనున్నన సీసీరోడ్లు, సైడ్ డ్రైనేజీలు, విద్యుత్ విద్యుత్ పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన పేర్కొన్నారు. మండల కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

భారత మాత పూజోత్సవం


భారత మాత పూజోత్సవం నిర్వహి స్తున్న నాయకులు

రాయికల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైతాపూర్, కొత్తపేట గ్రామాల్లో ఆదివారం ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో భారతమాత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ జాగరణ ప్రాంత పరియోజన ప్రముఖ్ దయానంద మాట్లాడుతూ భారతమా తను మన తల్లిగా ఆరాధిస్తూ స్వాతంత్ర్య యోధులతో కలిపి ప్రతియేటా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవడం మన కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ జాగరణ ప్రముఖ్ తిరుకోవెల సురేందర్, జగదీష్, లింగారెడ్డి, రాము, శ్రీనివాస్, కొత్తపేట మాజీ సర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ శ్రీనివాస్, గంగాధర్, అర్చకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవి కొందరికే..!

- ఈనెల 26వ తేదీ నుంచి రేషన్ కార్డుల జారీ
- సర్వే జాబితాలో పేదల పేర్లు గల్లంతు
- పెండింగ్‌లో సుమారు 55 వేల మీ సేవా, ఆన్‌లైన్ దరఖాస్తులు
- సమగ్ర కుటుంబ సర్వే వివరాలతోనే పంపిణీ
- ప్రజాపాలన దరఖాస్తుదారుల్లో నిరాశ



జగిత్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి పంపిణీ చేయనున్న కొత్త రేషన్ కార్డులు కొందరికి అందనున్నాయి. సమగ్ర కుటుంబ సర్వేకోసం ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వేలో అందిన వివరాల ఆధారంగా రేషన్ కార్డులేని కుటుంబాలు జిల్లా పరిధిలో 19,974 దరఖాస్తులు మాత్రమే ఉన్నట్లు అధికారులు లెక్కలు తీశారు. ఆ లెక్క మేరకే క్షేత్ర స్థాయి సర్వే జరుపుతున్నారు. క్షేత్ర స్థాయిలోనూ అర్హులుగా గుర్తించిన వారికే కొత్తరేషన్ కార్డు లివ్వనున్నారు.

ఎదురు చూస్తున్న వారెందరో...

నిజానికి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్ పరిధిలో దాదాపు సుమారు 55 వేల మంది రేషన్ కార్డులేక ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు వేల సంఖ్యలో ఉన్నారు. మిగితా వారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేదు. ఇంటింటి సర్వే సైతం నూరు శాతం జరగలేదు. కొందరు సర్వేను వ్యతిరేకించారు. వారిలో రేషన్ కార్డు లేని వారికి సైతం ఇపుడు అవి అందే పరిస్థితి లేకుండా పోయింది. కుటుంబ సర్వే మేరకు రేషన్‌కార్డుల్లేని కుటుంబాలను పరిశీలించి వారికి మాత్రమే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

పాత మార్గదర్శకాలే....

2014లో అప్పటి ప్రభుత్వ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు ఇటీవల పలువురు ప్రజాప్రతినిధులు అంటున్నారు. రేషన్ కార్డులు లేనివారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని వాటిని కూడా పరిశీలించి కార్డులు జారీ చేస్తామంటున్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమంటున్నారు. కానీ ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదో అంతు చిక్కడం లేదు.

(తరువాయి 8లో)

ఇదీ షెడ్యూలు...

- ఈ నెల 16వ తేదీ నుంచి 20 వరకు క్షేత్ర స్థాయి సర్వే
- 21వ తేదీ నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారుల వివరాలు వెల్లడి
- 21వ తేదీ నుంచి 25 మధ్య అర్హుల డాటా ఎంట్రీ
- 26వ తేదీ (రిపబ్లిక్ డే) కొత్త రేషన్ కార్డుల జారీ
- 26వ తేదీన పాత రేషన్ కార్డుల్లో అదనపు కుటుంబ సభ్యుల మార్పులు, చేర్పులు

జిల్లాలో 2024 జూన్ నాటికి రేషన్ కార్డుల వివరాలు

- ఆహార భద్రతా కార్డులు..2,92,450..కార్డుల్లో సభ్యుల సంఖ్య.. 8,44,755
- ఏఎఫ్‌సీ కార్డులు...14,532...కార్డుల్లో సభ్యుల సంఖ్య...37,277
- అన్నపూర్ణ కార్డులు....145....కార్డుల్లో సభ్యుల సంఖ్య... 155
- మొత్తం కార్డులు...3,07,127...కార్డుల్లో సభ్యుల సంఖ్య...8,82,187...

పకడ్బందీగా దివ్యాంగుల

ఉపాధి, పునరావాస పథకం అమలు

బోనగిరి నరేశ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి



జగిత్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఉపాధి, పునరావాస పథకాన్ని పకడ్బందీగా అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ శాఖ ద్వారా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న దివ్యాంగుల ఉపాధి పథకం గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: దివ్యాంగులకు ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇస్తున్నారు.?

అధికారి: జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ఉ పాధి, పునరావాసం పథకం ద్వారా రుణాలు అందిస్తున్నాము. బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ. 50 వేల సబ్సిడీ, బ్యాంకు లింకేజీ ద్వారా రూ. లక్ష యూనిట్‌కు రూ. 80 వేల సబ్సిడీ అందిస్తున్నాము. రూ. 2 లక్షల యూనిట్‌కు రూ. 1.40 లక్షల సబ్సిడీ, రూ. 3 లక్షల యూనిట్‌కు రూ. 1.80 లక్షల సబ్సిడీ వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: గత యేడాది ఈ పథకం కింద ఎన్ని యూనిట్లు మంజూరు చేశారు..? ప్రస్తుత యేడాది పరిస్థితి ఏమిటీ..?

అధికారి: జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ పథకం కింద 25 యూనిట్ల ద్వారా రూ. 15.50 లక్షల సబ్సిడీ మంజూరు చేశాం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను అర్హుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నాము. లబ్ధిదారుల ఎంపిక ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: పథకం కింద లబ్ధి పొందడానికి దరఖాస్తు ఎలా చేసుకోవాలి..ఎప్పటివరకు చివరి తేదీగా నిర్ణయించారు..?

అధికారి: ఈ పథకం కింద అర్హులైన దివ్యాంగులు సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు చేసుకోవాలి. ఈనెల 23వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు చివరి తేదీగా నిర్ణయించాము.

ఆంధ్రజ్యోతి: దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు ఏమిటీ..?

అధికారి: ఈ పథకం కింద లబ్ధిపొందడానికి కనీసం 40 శాతం దివ్యాంగత్వం కలిగి యుండాలి. 21 నుంచి 55 సంవత్సరాల్లోపు ఉండాలి. 1.50 లక్షలు గ్రామీణ ప్రాంతాల్లో, రూ. 2 లక్షలు పట్టణ ప్రాంతాలలో ఆదాయ పరిమితి కలిగి ఉండాలి. ఐదేళ్లలో ఈ పథకం కింద లబ్ధిపొందకుండా ఉండాలి. కుటుంబాన్ని యూనిట్‌గా పరిగణిస్తాము. దరఖాస్తుతో పాటు సదరం సర్టిఫికేట్, ఆధార్ కార్డు, ఆదాయ, నివాస, వయస్సు, కుల, విద్యార్హత ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లు జత పరచాల్సి ఉంటుంది.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, జనవరి19(ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం మండలంలోని పూడూర్‌లో తోటి కులస్తులు నిర్వహించిన జంగుబాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట తోటి సంఘం నాయకులు కోట లక్ష్మణ్, దేవెందర్, ఓదేలు, యువజన కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మనులు రవీం దర్‌రెడ్డి, రాజనర్సింగరావు, కాంగ్రెస్ నారాయణగౌడ్, మల్లిఖార్జున్‌రెడ్డి, పాల్గొన్నారు.

పద్మశాలి సంఘ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలు

మెట్‌పల్లి టౌన్, జనవరి19(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఇబ్రహీంపట్నం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి పలు రకాల పోటీలను నిర్వహించారు. వనభోజనాలను ఏర్పాటు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. పద్మశాలి సంఘం నాయకులు గంగాధర్, శశిధర్, ప్రతాప్, రాజారాం ఉన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ.. పునఃప్రారంభిస్తాం

- 26 నుంచి రేషన్ కార్డుల జారీ
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

7


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీది నియంత పాలన

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి

8


కథలాపూర్‌లో మాట్లాడుతున్న బాపురెడ్డి, తుల ఉమ

నిబంధనలను పాటిస్తూ వాహనం నడపాలి

- జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశం



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై మల్లేశం

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలను పాటిస్తూ, వాహనం నడపాలని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశం సూచించారు. పట్టణంలోని యావర్‌రోడ్ పార్క్ సమీపంలో ట్రాలీ ఆటో డ్రైవర్లకు ఆదివారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, వాహన సంబంధ ధృవపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని సూచించారు. ప్రమాదాల నివారణలో తమవంతు తోడ్పాటును అందించాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్ రిలీజ్ చేసి డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శంకర్, హోంగార్డులు లక్ష్మణ్, సంతోష్, పాషాతో పాటు ట్రాలీ ఆటోల డ్రైవర్లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తున్న మైదానాలు
- గ్రామంలోనే మూలుగుతున్న స్పోర్ట్స్ కిట్లు
- లక్షల రూపాయలు వెచ్చించినా ప్రయోజనం శూన్యం



అర్బన్ మండలం హస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు గత ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో రెం డేళ్ల క్రితం ప్రారంభించిన తెలంగాణ క్రీడా మైదానాల దుస్థితి అత్యంత దయనీయంగా మారింది. వాటి నిర్వహణను గానీ, వినియోగం గురించి గానీ పట్టించుకునే నాథుడే లేకపోవడంతో గడ్డి మొలిచి, పిచ్చి మొక్కలతో మరింత అధ్వానంగా మారాయి. కొన్ని చోట్ల పశువులు సంచరిస్తూ గడ్డిని మేస్తుండగా, మరికొన్ని చోట్ల సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సైతం వినియోగించుకుంటున్నట్లు సమాచారం. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులతో పాటు, లాంగ్ జంప్ పిట్, వ్యాయామం కోసం తగిన విధంగా సింగిల్, లేదా డబుల్ బార్‌లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితి ఎక్కడా లేదని క్రీడాకారులు వాపోతున్నారు. ఈ ఆట స్థలాల చుట్టూ మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతూ సంరక్షించే పురపాలికలు, గ్రామ పంచాయతీలు కనీసం పట్టించుకోకపోవడంపై క్రీడా మైదానాల అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి.

● జిల్లాలో మొత్తం 419 క్రీడాప్రాంగణాలు

జిల్లాలోని 20 మండలాల్లోని 380 గ్రామ పంచాయతీలు, 39 హాబిటేషన్ గ్రామాలు కలుపుకొని మొత్తం 419 గ్రామాలు ఉన్నాయి. ఇందులో ప్రతీ గ్రామ పంచాయతీలో స్థల సేకరణ చేసి, ఒక్కో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుకు ఎకరం స్థలం ఉన్నచోట రూ. 2.60వేలు, 30గుంటల స్థలం ఉన్నచోట ఏర్పాటుకు రూ.2.10లక్షలు, 20 గుంటల స్థలం ఉన్నచోట రూ.1.70వేలు కేటాయించినట్లు సమాచారం. ఇందులో 05 గ్రామాలకు సంబంధించిన క్రీడాప్రాంగణాలు పూర్తి కాకపోగా, మిగతా 414 క్రీడా ప్రాంగణాలు పూర్తయ్యి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొడిమ్యాల, మల్యాల, సారంగాపూర్, మెట్‌పల్లి, బుగ్గారం మండలాల్లో ఒక్కోటి చొప్పున క్రీడాప్రాంగణాలు ఏర్పాటు కావల్సిఉన్నట్లు సమాచారం.

● వినియోగించుకోని కిట్లు

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలతో పాటు అర్బన్ పరిధిలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు సైతం రెండేసి చొప్పున కిట్లు క్రీడల కోసం ప్రభుత్వం మంజూరు చేసింది. అవన్నీ జిల్లా నుంచి అన్ని గ్రామపంచాయితీలకు ఎప్పుడో చేరిపోయాయి. కానీ నేటికీ కిట్ ఓపెన్ చేసింది లేదూ, క్రీడలు ఆడించిన దాఖలాలు సైతం లేకపోవడంపై క్రీడాభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. అసలు కిట్లు ఉన్నాయా? లేదా అనే అనుమానాన్ని సైతం కొందరు క్రీడాకారులు వ్యక్తం చేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 750 క్రీడల కిట్లు పంపిణీ చేయగా, మరో 30 కిట్లు రిజర్వ్‌లో ఉంచారు. వీటితో పాటు కొన్ని మండలాలకు అదనంగా కిట్లు పంపిణీ చేశారు. క్రీడల అభివృద్ధికి గత ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినా వాటిని వినియోగించుకోకపోవడంతో ఎందుకు పనిరాకుండా పోతున్నాయి. దీంతో పాటు చాలా చోట్ల జిల్లాలో క్రీడాప్రాంణాలను కనీసం చదును చేయకుండా ఏర్పాటు చేయడంతో ఆటలు ఆడే పరిస్థితి లేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చాలా చోట్ల బోర్డులు, బార్ స్టాండ్‌లే దర్శనం ఇస్తున్నాయి. మిగతా కబడ్డీ, వాలీబాల్, వ్యాయామం బార్లకు సంబంధించిన కోర్టులు మచ్చుకైనా కనిపించకపోవడం అధికారుల పర్యవేక్షణ, పనితీరుకు అద్దం పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వినియోగంలోకి తేవాలి



గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ గ్రామీణ స్థాయిలో క్రీడల ప్రోత్సాహానికి గ్రామగ్రామాన పట్టణ ప్రాంతాల్లో క్రీడామైదానాలను ఏర్పాటు చేసి, ప్రతి క్రీడా మైదానానికి అవసరమైన కిట్లను సైతం అంద జేశారు. కానీ జిల్లాలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలన్నీ నిరుప యోగంగా ఉన్నాయి. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృ ష్టి సారించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి. మరింత జాప్యం జరిగితే క్రీడల అభివృద్ధికి విఘాతం కలిగే పరిస్థితి ఉంది. ఉన్నతా ధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలల్లో వసతులు మెరుగు పరిచి, అందుబాటులోకి తేవాలని కోరుతున్నా.


- దావ వసంత సురేష్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్

రూ.40 కోట్లతో గ్రామాల్లో రహదారుల నిర్మాణం


జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రూ.40 కోట్లతో త్వరలో గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టనున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని 33, 34, 35 వార్డుల్లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.70 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా 34వ వార్డులోని శ్రీ ముత్యాల పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ప్రజ్ఞ మున్నూరు కాపు యువజన సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.70 కోట్లతో జగిత్యాల పట్టణంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, 20 వేల మంది ప్రజలు డబుల్ బెడ్ రూం ఇళ్లలో త్వరలో నివాసం ఉండబోతున్నారన్నారు. రూ.5 కోట్లతో జగిత్యాలలో ఇందిరా మహిళా శక్తి భవనం ఏర్పాటు చేశామన్నారు. రైతు బజార్‌లో హోల్‌సేల్ మా ర్కెట్ అభివృద్ధి చేశామని, పట్టణంలో 6500 మందికి నూతన రేషన్ కార్డును మంజూరు చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్లు పిట్ట ధర్మరాజు, గుడ్డ జగదీష్, రజ ని, నరేందర్, కోసరి అనిల్, కూతురు రాజేష్, కూతురు పద్మ, బద్దం లత, జగన్, గుర్రం రాము, జుంబర్తి రాజ్ కుమార్, కోరె గంగమల్లు, అల్లె గంగసాగర్ పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర గ్రాడ్యుయేట్స్ ఏఈవో అసోసియేష న్ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన సంధ్య సంపత్ ఎమ్మె ల్యేను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సీఎంను కలిసిన కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డితో గల్ఫ్ ప్రతినిధులు

జగిత్యాల అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ మృతులు 94 మందికి సంబంధించిన రూ.5 లక్షల చొప్పున రూ.4 కోట్ల 70 లక్షల నిధులను త్వరగా విడుదల చేయాలని సింగపూర్ పర్యట నలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులను కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ నాయకులు మంద భీంరెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి ఆదివారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు వద్ద ఉన్న పెండింగ్ ఫైల్‌ను ఆమోదింపజే యా లని కోరారు. గల్ఫ్, ఇరాక్‌తో పాటు సింగపూర్, మలేసియా తదితర 18 ఈసీఆర్ దేశాలలో మృతి చెందిన కార్మికులకు కూడా ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయాలన్నారు. అంత కుముందు శనివారం సాయంత్రం ప్రవాసులతో సింగాపూర్‌లోని తెలంగాణ కల్చరల్ సొసైటీ ఏర్పాటు చేసి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కుందూరు జైవీర్ రెడ్డి, సింగాపూర్ తెలంగాణ సంఘం అధ్యక్షుడు గడప రమే ష్ మాజీ అధ్యక్షుడు నీలం మహేందర్ పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి యువకుడి మృతి


నరేష్ మృతదేహం

ఇల్లందకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి డ్రైనేజీలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం ఇందిరానగర్‌కు చెందిన సకినాల నరేష్ (30) తన అత్తగారి ఊరైనా పాతర్లపల్లి గ్రామానికి చెందిన తన బాబాయి కొడం జయపాల్‌తో కలిసి ఇల్లందకుంట నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లందకుంట ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో బైక్ అదుపు తప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. తీవ్ర గాయాలతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. జయపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కోరుట్ల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. కోరుట్ల పట్టణానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాద వివరాలను గ్రామస్థులు, పోలీసులు తె లిపారు. నిజామాబాదు జిల్లా కేంద్రంలోని పెంటర్‌నగర్ చెందిన షేక్ రశీద్ (25) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై కోరుట్ల పట్టణంలోని బీముని దుబ్బ ప్రాంతంలోని తన అక్కను కలిసి జగిత్యాలలో ఉన్న స్నేహితుడిని కలవాడిని వెలు తున్నాడు. ఈ క్రమంలో వెంకటాపూర్ శివారుకు చేరుకోగా జగిత్యాల నుంచి వస్తున్న కారు రశీద్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో రశీద్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన వ్యవసాయక్షేత్రం వైపు దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఆడెపు రాజు, గాజెంకి మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ, కోరుట్ల ఇన్‌చార్జి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. రశీద్ సోదరుడు షేక్ మజీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రశీద్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మానేయాలన్నందుకు మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మానేయాలని కూతురు మందలించినందుకు తల్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వేముల నర్సవ్వ (45) కొంత కాలంగా మద్యానికి బానిసైంది. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కూతురు పూజితను అడగడంతో ఆరోగ్యం క్షీణిస్తుందని, మద్యం మానేయాలని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నర్సవ్వ శనివారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సవ్వ తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కూతురు పూజిత, కొడుకు శేఖర్ చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. నర్సవ్వ భర్త రాజలింగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి రెండు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయంలో, మల్లన్న స్వామి ఆలయంలో హుండీలను పగలగొట్టి అందులోని డబ్బులను దొంగిలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూచిపూడిలో రాణిస్తున్న 'ఖని' కళాకారిణి


కూచిపూడి కళాకారిణి జ్యోతిర్మయి

కోల్‌సిటీటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన దగ్గుల జ్యోతిర్మయి కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. తనలాగే ఎంతో ఆసక్తి కలిగిన ఎంతో మందిని కూచిపూడి నృత్య కళాకారుణులుగా తీర్చిదిద్దుతున్నది. ఆమె భర్త ఆనంద్ సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా ఓసీపీ-5లో సింగరేణి ఉద్యోగి. జ్యోతిర్మయి మూడవ తరగతి చదువుతున్న సమయంలో తండ్రి రామస్వామి కూచిపూడి నృత్య అకాడమీ జక్క కృష్ణ వద్ద చేర్పించి శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లో ఏలేశ్వరపు విజయవల్లీప్రియ గురువు వద్ద కూచిపూడిలో డిప్లమా పూర్తి చేసింది. కూచిపూడి నాట్యప్రదర్శనలిస్తూ నాట్యజ్యోతిర్మయిగా పేరొందింది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సహంతో జ్యోతిర్మయి జాతీయ స్థాయిలో కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చిన పలు అవార్డులు



జ్యోతిర్మయికి అవార్డుతో పలువురి సత్కారం

పొందింది. ఆలయాల్లో నృత్యప్రదర్శనలతో నాట్యనీరాజనం ఇచ్చేందుకు జ్యోతిర్మయి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది.

● వైష్ణవి నాట్యస్థల్‌తో పలువురికి శిక్షణ..

కూచిపూడి నృత్యాన్ని ఇతరులకు నేర్పించాలనే సంకల్పంతో వైష్ణవి నాట్యస్థల్ కూచిపూడి నృత్య అకాడమీని జ్యోతిర్మయి 15 ఏళ్ళ క్రితం ప్రారంభించింది. తన శిష్యులతో పలు ప్రదర్శనలు ఇచ్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకున్నానని, ఇది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని జ్యోతిర్మయి తెలిపింది.




కూచిపూడిలో శిక్షణ ఇస్తున్న జ్యోతిర్మయి

కారు అద్దాలు ధ్వంసం


పగిలిన కారు అద్దాలు

మల్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మల్యాల మాజీ ఎంపీపీ ఆగంతపు రవళీవంశీధర్‌కు చెందిన కారు అద్దాలను ఓ యువకుడు ధ్వంసం చేశాడు. శనివారం రాత్రి సదరు యువకుడు వంశీధర్‌తో పాటు అతని కుటుంబసభ్యులను దుర్భాషలాడుతూ ఇంటి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో అక్కడ గల కారు అద్దాలను ధ్వంసం చేశాడు. కాగా తమపై దాడికి యత్నించినట్లు అదే ప్రాంతానికి చెందిన యువకుడిపై వంశీధర్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

వీణవంక జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసుల కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్ర మంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి


సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొండా దేవయ్య

వేములవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపులు ఐక్యతతో రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల మున్నూరు కాపు సంఘం కార్యాలయాన్ని ఆదివారం వేములవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ పరిధిలోని జిల్లాలకు చెందిన కార్యకలాపాల నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశంతో వేములవాడలో సంఘం కార్యాలయం ప్రారంభించామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 3000 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుకోవాలని కోరారు. రాష్ట్ర మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రజిత, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు రత్నాకర్, రాష్ట్ర యువత కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల పూజలు

ఓదెల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పూజలను ఘనంగా నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన నుంచి తరలివచ్చిన భక్తులంతా ఆలయంలో అర్చనలు, కోడె మొక్కులను సమర్పించారు. అలాగే మల్లన్నకు భక్తులు ఒగ్గుపూజారులతో పట్నాలు నిర్వహించారు.


ఓదెల మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

భూవివాదంతో దాడి..
ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో ఆదివారం ఇరు వర్గాల నడుమ నెలకొన్న భూవివాదం దాడి చేసుకునే వరకు చేరుకుంది. దాడి ఘటనలో మండల కేంద్రానికి చెందిన గడ్డం పుష్పలత, ఇద్దరు కొడుకులు కరుణాకర్, జగన్ తీవ్ర గాయాలపాలయ్యారు. దాడికి పాల్పడిన బండలింగంపల్లిలోని తండ్రీకొడుకులు బందుక శ్రీనివాస్, నరేశ్‌లపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రంలోని గడ్డం ఆనందం 2020లో బండలింగంపల్లికి చెందిన నర్సయ్య వద్ద 1.08 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. పొలం వద్దకు వెళ్లిన ఆనందం భార్య పుష్పలత, ఇద్దరు కొడుకులు కరుణాకర్, జగన్‌పై అదే గ్రామంలోని బందుక శ్రీనివాస్, అతని కొడుకు నరేశ్ ఆ భూమి తమదేనని అడ్డుకున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే గడ్డపారతో దాడికి దిగారు. పుష్పలత, కరుణాకర్, జగన్ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఆనందం ఫిర్యాదుతో శ్రీనివాస్, నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బోర్‌వెల్ వాహనం బోల్తా

మల్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని బల్వంతాపూర్ స్టేజీ సమీపంలో బోర్‌వెల్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. జగిత్యాల వైపు నుంచి వస్తున్న బోర్‌వెల్ వాహనం బల్వంతాపూర్ స్టేజీ సమీపంలో జాయింట్ రాడ్డు విరగడంతో అదుపుతప్పి రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో వాహనంలో గల ఒడిశాకు చెందిన సురేందర్, బీం, బాలారామ్, నిదేశ్‌లకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేసి పదవి విరమణ పొందిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి రాజయ్య కోరారు. పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఆదివారం హుజూరాబాద్ రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమావేశం ఎం రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 పేస్కేల్ బకాయిలు, వృద్ధాప్యంలో ఉన్న కార్మికులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఫ్రీగా అనుమతించాలన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే అందజేయాలని డిమాండ్ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు ఆర్ చారి, రాజయ్య, వి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి) వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజరాజేశ్వరస్వామివార్లను దర్శించుకు న్నారు. రాజన్నకు ప్రీతి ప్రాతమైన కోడె మొక్కు చెల్లించుకున్నా రు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు తిరుపతిరావు, రాజేందర్, నర్సయ్య, నరేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్న ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

● కొనసాగుతున్న ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్ జనవరి 19 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు లక్ష్మీనారాయణ భాగవతార్, ఉదయం 10గంటలకు వేదవతి భాగవతారి ఆధ్వర్యంలో హరికథ నిర్వహించారు. అపర్ణ భార్గవ కర్ణాటక గాత్రకచేరి, తిరుమల లత సంగీత కచేరి భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు దుర్గా మైత్రి నిర్వహించిన సోలో వీణ కచేరి, నాలుగున్నర గంటలకు హరికృష్ణ భార్గవి నిర్వహించిన సంగీత కచేరి అలరించాయి.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర


తాండ్ర్యాలలో పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తాండ్ర్యాలలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతరో త్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి కొండపైకి స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పం డితులు మేడలాంబ కేతలాంబ సహిత మల్లికార్జునస్వా మి కల్యాణం నిర్వహించగా చుట్టు పక్కన గ్రామాలైన గంభీర్‌పూర్, పోసానిపేట, ఇప్పపల్లి, పోతారం గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా భక్తులు త మ మొక్కులు చెల్లించుకున్నారు. వేము లవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జిల్లా పరిషత్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పూజల్లో పాల్గొ న్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బీసీ జాతీయ సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్శరాం

వేములవాడ కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ జాతీయ సంక్షేమ సంఘం యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెడ్డవేణి పర్శరాంను నియమిస్తూ ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామకపు పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం నియామక పత్రాన్ని అందిం చినటట్లు బీసీ జాతీయ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాం తెలిపారు. తన నియమకానికి సహకరించిన ప్రతీ ఒక్క బీసీ జాతీయ సంక్షేమ రాష్ట్ర జిల్లా మండల నాయకులకు రెడ్డవేణి పర్శరాం కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహనం అప్పగింత

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కొద్ది రోజులుగా ఉంటున్న టీఎస్02ఈక్యూ7104 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని యజమాని అందె కృష్ణకు ఆర్టీసీ అధికారులు ఆదివారం అందించారు. కొద్ది రోజులుగా బస్టాండ్ ఆవరణలో ద్విచక్ర వాహనాన్ని ఉండడాన్ని గమనించి భద్రత సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ భద్రత ఏటీఎం బి సురేష్ ద్విచక్ర వాహనాన్ని యజమానికి అందించారు. తన బైక్ ఇంటి ఎదుట పార్క్ ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లారని, నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నాడు. కార్యక్రమంలో బస్టాండ్‌భద్ర త సిబ్బంది లక్పతి, ఏఎస్‌ఐ అజయ్‌కుమార్, అంజయ్య, పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాల బాలికల కబడ్డీ పోటీలు


విజయం సాధించిన కరీంనగర్ బాలికల జట్టు

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో సౌత్‌జోన్ బాల బాలికల అండర్-16 కబడ్డీ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. బాలికల విభాగంలో హుజూరాబాద్ జట్టుపై కరీంనగర్ జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో కరీంనగర్ జట్టుపై హుజూరాబాద్ జట్టు ఫైనల్లో విజయం సాధించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక బహుమతులు ప్రధానం చేశారు. అలాగే క్రీడాకారులకు వర్ధినేని రవీందర్ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్‌రెడ్డి, రమేష్, రవీందర్, తిరుమల్‌రెడ్డి, ముత్యంరాజు, టి శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

ఆశలు అడియాశలు

- నెరవేరని పరిశ్రమల ఏర్పాటు హామీ
- అందుబాటులో 600 ఎకరాల ప్రభుత్వ భూమి


గంభీర్‌పూర్‌లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ యూనివర్శిటీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, గొర్రెల పెంపకం, సైనిక్ స్కూల్, లెదర్ పార్క్ వంటి పరిశ్రమలు గంభీర్‌పూర్‌కు వస్తాయని గంపెడాశలు పడ్డా కల నెరవేరలేదు. గత బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలు వస్తాయంటూ నేతలు ఇచ్చిన హామీ లతో స్థానికులు ఎంతో సంబరపడ్డా నిరాశే ఎదురైంది. గ్రామ శివారులో గుట్టల ప్రాంతంలో సుమారు 600 ఎకరాలు మేర ప్రభుత్వ భూములు ఉండడంతో ఇక్కడ పరిశ్రమలకు అనువైన ప్రాంతమని నిర్ణయించారు.

● గంభీర్‌పూర్ శివారులో..

గంభీర్‌పూర్ శివారులో 570, 571 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదికలతో పరిశ్రమల స్థాపనకు అనువుగా ఉంటుందనే భావనకు వచ్చారు. 2014లో తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ సర్కారు కొలువు దీరగా హార్టికల్చర్ యూనివర్శిటీ ఏర్పాటు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సంబంధిత శాఖ అధికారులు హడావుడి చేశారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజవర్గం గజ్వేల్‌కు మంజూరు చేయడంతో నిరాశకు గురయ్యారు. తదనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటును పరిశీలించి రెవెన్యూ అధికారులతో సర్వేలు పూర్తి చేయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఫలితం కనిపించలేదు. గొర్రెల పెంపకం, లెదర్ పార్క్, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి పలు మార్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. పరిశ్రమలు ఏర్పడితే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

● నాలుగు మండలాలతో..

బీమారం, కొడిమ్యాల, రుద్రంగి, చందుర్తి మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాకు అనుసంధానంగా ఉండడంతో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల మెరుగుకు ఎంతో అనుకూలంగా ఉంది. గత సర్కారు విస్మరించిన నేపథ్యంలో కొత్త సర్కారు గంభీర్‌పూర్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తుందని కోటి ఆశలు పెట్టుకున్నారు

అనుమతి లేని లేఅవుట్‌లో హద్దు రాళ్ల తొలగింపు

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని అక్రమ లేఅవుట్లపై ఆదివారం పంచాయతీ అధికారులు కొరడా ఝళిపించారు. నగునూర్‌లోని సర్వే నంబర్ 453, 454లోని రెండెకరాల విస్తీర్ణంలో పంచాయతీ, సుడా అనుమతి లేకుండానే లే అవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు చేయడంతో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది హద్దు రాళ్లను తొలగించారు.

షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తాం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునఃప్రారంభిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరాభవన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన కోటి యాభై లక్షల విలువల గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి కింద లబ్ధిదారులకు ఆసుపత్రుల్లో అయిన ఖర్చులో 25-30 శాతం అందిస్తోందన్నారు. ప్రజలు ముఖ్యంగా ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్న ఆసుపత్రుల్లో వైద్యసేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ కింద రాష్ట్ర ప్రభుత్వం 10లక్షల రూపాయల వరకు వైద్య ఖర్చులు అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వం కన్నా మిన్నగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రుణమాఫీ అంశాన్ని బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టలేదని, బీజేపీకి రుణమాఫీపై సోయిలేదన్నారు. దేశంలో రైతులకు రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వమే అన్ని రాష్ట్రాల రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్‌పై పేటెంట్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, గత ప్రస్తుత ప్రభుత్వాలు ఆ విధానాన్ని కొనసాగింపు చేస్తున్నాయన్నారు. జనవరి 26 నుంచి రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా, వ్యవసా య కూలీలకు రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు కట్టించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, అనర్హులకు ఒత్తిళ్లకు తలొగ్గి ఇళ్ల మంజూరుకు అవకాశం ఇస్తే చట్టప్రకారం చర్యలుంటాయ న్నారు. పసుపు బోర్డు ప్రకటన శుభపరిణామమని, పసుపు బోర్డు ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. సమావేశంలో నాయకులు బండ శంకర్, తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, పిప్పిరి అనిత, జున్ను రాజేందర్, రాధాకిషన్‌రావు, దుర్గయ్య, బారి, కమాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మీ టికెట్'తో చూసొద్దామా..



- ఆలయాలు, పర్యాటక ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆలయ దర్శనాలు, విహార యాత్రల విశేషాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీ టికెట్ పేరుతో ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో రాష్ట్రంలోని 15 ఆలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్, జంతు ప్రదర్శన శాలలు, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్‌కు సంబందించిన వివరాలు పొందుపరిచారు. స్మార్ట్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత ప్రవేశ టికెట్లు పొందవచ్చు. ఇటీవల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. మరిన్ని ప్రధాన ఆలయాలు, పర్యాటక ప్రాంతాల వివరాలు ఈ యాప్‌లో పొందుపరచాల్సి ఉంది.

● ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, ప్రాంతాల వివరాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి దేవాలయం, రాజన్న సిరిసిల్ల జిల్లా అర్బన్ ఫారెస్ట్, కరీంనగర్‌లోని ఎల్ఎండీ, పెద్దపల్లిలో బోటింగ్‌కు సంబంధించిన వివరాలు యాప్‌లో ఉంటాయి.

● డౌన్‌లోడ్ ఇలా చేసుకోవాలి

తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరి వారు రూపొందించిన 'మీ టికెట్' యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అకౌంట్‌లో పిన్ నంబరు జనరేట్ చేసుకోవాలి. మన ఫోన్‌కు ఓటీపీ నంబరు వచ్చాక దాన్ని నమోదు చేయాలి. అనంతరం ఫోన్ నంబరు, పిన్ నంబరు ఎంటర్ చేసి లాగిన్ అయితే అందులో అన్ని వివరాలు తెలుస్తాయి.





వేములవాడ

గర్భాలయ దర్శనం	రూ. 1000
శీఘ్ర దర్శనం	రూ. 100
కోడె కట్టడానికి	రూ. 200

సేవలకు వేర్వేరుగా రుసుములు చెల్లించాల్సి ఉటుంది.



కొండగట్టు

గర్భాలయ దర్శనం	రూ. 400
అతి శీఘ్ర దర్శనం	రూ. 300
శీఘ్ర దర్శనం	రూ. 100



ఎల్ఎండీ, పెద్దపల్లిలో బోటింగ్

పిల్లలకు	రూ. 30
పెద్దలకు	రూ. 50
స్పీడ్ బోట్‌కు నలుగురికి	రూ. 350



సిరిసిల్లలోని అర్బన్ ఫారెస్ట్ పార్క్

కెమెరా	రూ. 300,
టూ వీలర్స్ పార్కింగ్	రూ. 10
బస్సు, వ్యానుకు	రూ. 50
ప్రవేశ రుసుము:	
పిల్లలకు	రూ. 10
పెద్దలకు	రూ. 30

● యాప్‌లో ఇంకా చేర్చాల్సినవి..

ధర్మపురి ఆలయ వివరాలు.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఉజ్వల, జింకల పార్క్ విశేషాలు, జిల్లా కేంద్రంలోని ప్రాచీన శైవ, వైష్ణవ క్షేత్రాల వివరాలు పొందపర్చలేదు. ఎలగందుల, మొలంగూరు, బొమ్మలమ్మగుట్ట, నగునూరు, దూలికట్ట వంటి చారిత్రక ప్రదేశాల వివరాలను కూడా పొందుపరిస్తే ఉమ్మడి జిల్లా వాసులు ఆయా ప్రాంతాలను యాప్ సాయంతో సందర్శించే అవకాశం ఉంటుంది.

వినోద భోజనంబులో 'ఖని' కళాకారుడి ప్రతిభ

కోల్‌సిటీటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో దర్శకుడు జంధ్యాల జయంతి సందర్భంగా నిర్వహించిన వినోద భోజనంబు కార్యక్రమంలో గోదావరిఖనికి చెందిన స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ప్రధానకార్యదర్శి చంద్రపాల్ ప్రతిభ కనపర్చారు. స్టాండప్ కామెడీతో నవ్వులు పూయించి ప్రశంసలందుకున్నారు. అందుకు గాను హాజరైన అతిథులు సినీదర్శకులు రేలంగి నరసింహారావు, దూరదర్శన్ ప్రయోక్త ఓలేటి పార్వతీశం చేతుల మీదుగా చంద్రపాల్‌కు జ్ఞాపికను అందజేసి అభినందించారు.


జ్ఞాపిక అందుకుంటున్న చంద్రపాల్

ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రంగంపల్లిలోగల పెద్దపల్లి లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బారీ, ప్రధానకార్యదర్శి సోమిశెట్టి తిరుపతి, వైస్‌ప్రెసిడెంట్ అజయ్, జాయింట్ సెక్రెటరీ ఎండి జహంగీర్, కోశాధికారి ఎండి అఫ్జల్, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వేడుకలు నిర్వహిస్తున్న లారీ డ్రైవర్లు

కన్నుల పండువగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని దసరా గుట్టపైన గల ప్రహ్లాద శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో స్వామి కల్యాణం కన్నుపండువగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో స్థాపిత దేవతల పూజ, ఉత్సవ మూర్తులను పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, పూజలు కార్యక్రమా ను బ్రహ్మశ్రీ గంగాప్రసాద్ దీక్షిత్ యాజ్ఞికంలో నంబి గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. స్వామి వారికి గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు పట్టు వస్త్రా లు సమర్పించగా అలంకరించారు. అనంతరం పురోహితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పురోహితులు రాజగౌతం, శితి కంఠ, షణ్ముఖశర్మ, నంబి మనోహర్‌శర్మ, నంబి రాజేందర్‌శర్మ, గ్రామ, ఆలయా భివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమతులు లేని సంఘాలతో క్రీడాకారులకు అన్యాయం

» హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు, నిబంధనల ప్రకారం లేని హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌తో క్రీడాకారులకు తీవ్రఅన్యాయం జరిగే అవకాశం ఉందని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు 52 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. అసోసియేషన్ పరిధిలో పనిచేస్తున్న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను, జిల్లాలోని అసోసియేషన్లు జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. 2021లో ఓ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని రాష్ట్రం, జిల్లాలో ఒలింపిక్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకులు లేకుండానే సంఘాలను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా సంఘాన్ని నడుపుతున్నట్లు ఆరోపించారు. ఈ సంఘం ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర పోటీలు లేకుండానే జాతీయ పోటీలు నిర్వహిస్తున్నారని, ఇలాంటి పోటీలతో క్రీడాకారులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సంఘం రాష్ట్రస్థాయిలో కీలకమైన పోస్టులో ఉన్నట్లు



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ సంఘ సభ్యులు రమేష్, పుల్లయ్య, శంకర్ నారాయణ, లక్ష్మణ్

ప్రచారం చేసుకుంటున్న వ్యక్తి కోచ్‌గా వ్యవహరిస్తూ రాష్ట్ర, జాతీయ పోటీలకు రెఫరీగా వ్యవహరిస్తున్నాడని, ఈ విషయంపై స్పోర్ట్స్ అథారిటీ దృష్టి సారించాలని కోరారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్ మాట్లాడుతూ కరీంనగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తమ రాష్ట్ర అసోసియేషన్ అనుమతి ఉన్నట్లు చూపించి జిల్లాలో ఓ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేసి క్రీడాకారులను తప్పుదోవ పటిస్తున్నాడన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌పై రిజిస్ట్రార్, సీపీకి ఫిర్యాదు చేసి కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కె రమేష్, నల్గొండ కార్యదర్శి పుల్లయ్య, మహబూబ్‌నగర్ కార్యదర్శి శంకర్ నాయక్ పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్‌గా రషీద్


మహ్మద్ రషీద్

కరీంనగర్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా మహ్మద్ రషీద్‌కు పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ యాస్మిన్‌భాషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు పదోన్న తి కల్పించారు. 1985లో దినసరి కూలీగా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో నాలుగేళ్ళు పనిచేసిన ఆయన స్కేల్ పోస్టు ఆపరేటర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇక ఆ తర్వాత సెరికల్చర్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది హన్మకొండ జిల్లాలో పనిచేసిన రషీద్ హుజురాబాద్ డివిజన్ సెరికల్చర్ అధికారిగా, కరీంనగర్ జిల్లా అధికారిగా కొనసాగుతున్నారు. పదోన్నతి కల్పించడంపై రషీద్ సంతోషం వ్యక్తం చేశారు.

ఐక్య పోరాటాల ద్వారానే కనీస వేతనం



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ఐక్య పోరాటాల ద్వారానే కనీస వేతనం, మద్ధతు ధరలు సాధించుకోవచ్చని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక, కర్షక మైత్రి దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 జనవరి 19న సాధారణ సమ్మె సాధించిన గొప్ప విజయం కార్మికుల, కర్షకుల ఐక్యత అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ సాధారణ సమ్మెకు ముందే తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వం వేలాది మందిని అరెస్టు చేసి జైలులో వేసిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల రాజు మాట్లాడుతూ వ్యవసాయకార్మికులు, పేద రైతులే కాక గ్రామాల్లో ఉన్న వృత్తి దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాయికంటి శ్రీనివాస్, కాంపల్లి పోచయ్య, రాజమణి, కవ్వంపల్లి రవి పాల్గొన్నారు.

రైతు సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొగిలి కిరణ్‌యాదవ్


నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ముత్తారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొగిలి కిరణ్ యాదవ్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ నియామక పత్రాలను హైదరాబాదులోని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మొగిలి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ పూర్వ వ్యవసాయసాగులో ఎలాంటి పద్ధతులు పాటించారో రైతులకు తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు నకిలీ విత్తనాల విక్రయాలు, అత్యధిక ధరలకు ఎరువు విక్రయాలను ఉపేక్షించబోమని తెలిపారు. కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా చిగురు విద్యాసాగర్‌ను నియమితులైనట్లు కిరణ్ యాదవ్ తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం

● ఆర్ఐలు కుమారస్వామి, మోడం సురేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆనందం, ఆరోగ్యం పెంపొందుతాయని ఆర్ఐ ఆఫ్ పోలీస్ కె కుమారస్వామి, మోడం సురేష్ అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో రెండో రోజు తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో వ్యాయామం, క్రీడలు తప్పనిసరి అని సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను అభినందించారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని, ఓడినవారు వచ్చే సంవత్సరం గెలుపునకు ప్రయత్నించాలన్నారు. క్రీడాకారులు అందరు కూడా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. మరో అతిథి జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడలు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్లు మంచి ప్రతిభచాటి చాంపియన్‌షిప్ సాధించాలన్నారు. కార్యక్రమలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, పోటీల పరిశీలకులు దీపక్ ప్రసాద్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, కోశాధికారి కనకయ్య, సంఘ రాష్ట్ర బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు మల్లేష్, శ్రీనివాస్, రాజశేఖర్, జయంత్, అమర్, శివాజీ, సాయి,తదితరులు పాల్గొన్నారు.


హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్ఐలు కె కుమారస్వామి, మోడెం సురేష్

● ఫైనల్స్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు..

తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల ఫైనల్స్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు చేరాయి. ఆదివారం సాయంత్రం జరిగిన సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 23-21 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు ప్రవేశించింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు 28-15 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. సోమవారం ఉదయం ఫైనల్స్ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. కాగా మూడు, నాలుగు స్థానాల కోసం మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గంభీర్‌పూర్ ఉపాధ్యాయుడికి వోడాఫోన్ స్కాలర్‌షిప్

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న నల్ల సంజీవ్‌రెడ్డి వోడాఫోన్ స్కా లర్‌షిప్‌కు ఎంపికయ్యారు. నిరంత వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, వినూత్న బోధనా పద్ధతులు, బోధనలో టెక్నాలజీ వినియోగానికి గాను ఈ కంపనీ ప్రతీ ఏటా స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. 2024 విద్యా సంవత్సరానికి గాను సంజీవ్‌రెడ్డిని ఎంపిక చేస్తూ రు 25 వేల నగదును అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్లాపూర్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిరావుపేట గల్ఫ్ సంఘం క్యాలెండర్ ఆదివారం దుబాయ్‌లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించినట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లుడుతూ గల్ఫ్ కార్మికుల ఏకతాటికి తీసుకరావడానికి గల్ఫ్ సంఘం ఏర్పాటు చేశామన్నారు. జీడబ్ల్యూపీసీ అధ్యక్షుడు గుండెల్లి నర్సింహా, బీజేపీ ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షుడు వంశీగౌడ్, సామాజిక సేవకులు కాటుకం రవి, ఐపీఎఫ్ తెలంగాణ రాష్ట్ర కోకన్వీనర్ ఆర్ శరత్‌గౌడ్, వివిరావుపేట అధ్యక్షుడు పెనుకుల అశోక్, రోడ్డు శేఖర్, రఘుపతి, లక్ష్మరెడ్డి, రఘు, సరేందర్, మల్లేష్, మహేష్, రహీమ్, శంకర్, పాల్గొన్నారు.

గోసంగి సంఘం అధ్యక్షుడిగా పర్శురాం

మెట్‌పల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) :మెట్‌పల్లి గోసంగి సంఘం నూతన అధ్యక్షుడిగా మామిడిపల్లి పర్శురాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి అధ్యక్షుడిని ఎనుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పర్శురాంను సంఘ సభ్యులు పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కారించారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరుగనున్న రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్‌ను ఆదివారం సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి నాయక్, ఎంఏ చౌదరి, సురేష్ పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి..లక్షణంగా వదిలేశారు

- నిరుపయోగంగా మారిన ఇండోర్ స్టేడియం
- నిరాశలో క్రీడాకారులు

కోరుట్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్మించిన ఇండోర్ స్టేడియం నిరుపయోగంగా మారింది. తొమ్మిదేళ్ల క్రితం నిర్మాణం పూర్తి అయినా అధి కారులు అందుబాటులోకి తీసుకరాకపోవడంతో క్రీడాకారులు నిరాశ చెందుతున్నారు. ఇండోర్ స్టేడియం నిరుపయోగంగా ఉండడంతో అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. 11 ఏళ్ల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్టేడియం నిర్మాణానికి తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీంతో స్టేడియం నిర్మాణానికి అనుమతిని జారీ చేసింది. అప్పటి మున్సిపల్ చైర్మన్ ఎంఏ గఫార్ తన సోదరిడి పేరు మీద స్టేడియం నిర్మా ణానికి శ్రీకారం చుట్టారు. మైదానానికి ఇరువైపు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. మైదాన అభివృద్ధి పనులను చేపట్టారు. మైదానానికి అనుసంధానంగా ఇండోర్ స్టేడియం నిర్మాణానికి జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో తొమ్మిదేళ్ల క్రితం ప్రభుత్వం రూ. 1.60 కోట్ల నిధులతో భవన నిర్మాణానికి నిధుల మంజూరు చేసి పనులను చేపట్టింది. ఇండోర్ స్టేడియంలో షటిల్, టేబుల్ టెన్నీస్, క్యారంలతో పాటు ఇతర క్రీడలు నిర్వహించడానికి భవనాలను ఏర్పాటు చేశారు. అయితే భవనాలైతే పూర్తి చేశారు కానీ క్రీడా పరికరాలను సమకూర్చడంలో యువజన క్రీడల శాఖ పూర్తిగా విఫలం కావ డంతో ఇండోర్ స్టేడియం నిరపయోగంగా మారింది. నేటి వరకు ఇండోర్ స్టేడియంలో ఎలాంటి క్రీడలు నిర్వహించక పోవడంతో భవనం పాతబడిపోతోంది. ఇదిలా ఉండగా నిరపయోగంగా ఉన్న ఇండోర్ స్టేడియంలోని కిటికీలకు బిగించిన గ్లాస్‌లు ఆకతాయులు పూర్తిగా ధ్వంసం చేయడంతో పాటు ప్రధాన ముఖ ద్వారం పూర్తిగా ధ్వంసం చేయడంతో అసాంఘీక కార్యక్రమాలకు అడ్డగా మారింది. ఇప్పటికైన ప్రభుత్వం, క్రీడల శాఖల అధికారులు పట్టించుకుని ఇండోర్ స్టేడియంలో పరికరాలను సమకూర్చి క్రీడకారులను పోత్సహించాలని పట్టణ క్రీడాకారులు కొరుతున్నారు.



కోరుట్ల పట్టణంలోని ఇండోర్ స్టేడియం

ఉపయోగంలోకి తేవాలి

గిన్నెల సాగర్, హ్యాండ్ బాల్ జిల్లా కార్యదర్శి



పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్మాణం చేసిన ఇండోర్ స్టేడియంను ఉపయోగంలోకి తీసుకవచ్చి క్రీడకారులను పోత్సహించాలి. క్రీడాకారులను రాణించే విధంగా పరికరాలను ఏర్పాటు చేసి క్రీడాకారులను పోత్సహించాలి

క్రీడల అభివృద్ధికి కృషి చేయాలి

శ్రీనివాస్, వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



క్రీడల అభివృద్ధిపై క్రీడా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్మాణం చేసిన ఇండోర్ స్టేడియానికి ఉపయోగం లోకి తీసుకవచ్చి ఇండోర్ క్రీడలలో క్రీడకారులు రాణించే విధంగా చర్యలు చేపట్టాలి.

కొత్తవి కొందరికే..

(5వ పేజీ తరువాయి)

క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం అర్హుల జాబితా వార్డు సభలో వెల్లడించి చర్చించాకే ఆమోదిస్తారని ప్ర భుత్వం పేర్కొంది. అలా ఎంపికైన వారి జాబితాను కలెక్టర్‌కు పంపుతారు. వాటిని పరిశీలించి పౌరసరఫాల శాఖ కమిషనర్‌కు లాగిన్ పంపుతారు. పరిశీలించి కొత్త కార్డులు జారీ చేస్తారు. అర్హత కలిగిన వ్యక్తి పేరు కేవలం ఒక్క రేషన్ కార్డులో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఒకే వ్యక్తి పేరు ఒకటికి మించి ఉండటానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

- **సభ్యుల చేర్పులు, తొలగింపులు సైతం...**

జిల్లాలో ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం అధికారులు సర్వే చేస్తున్నారు. కొన్నేళ్లుగా మార్పులు లేకపోవడం వల్ల కార్డుల్లో అదనపు వ్యక్తులను చేర్చడం వంటివి జరగలేదు. జిల్లా వ్యాప్తంగా మీ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ విధానాల ద్వారా జిల్లా వ్యాప్తంగా 49,899 దరఖాస్తులు రేషన్ కార్డుల మార్పుల కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ఆ దరఖాస్తులను సర్వే చేసి పరిష్కరించాలని రెండు రోజుల క్రితం పౌరసరఫరా ల శాఖ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఈమేరకు మండల స్థాయిలో అందుబాటులో ఉ న్న అధికారులతో కొత్త రేషన్ కార్డుల సర్వేతో పాటు పాత రేషన్ కార్డుల్లో చేర్పుల కోసం సర్వే నిర్వహిస్తున్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నాము

జితేందర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కొత్త రేషన్ కార్డుల జారీ పకడ్బందీగా ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహిస్తున్నాము. ఇప్పటికే జిల్లాకు వచ్చిన జాబితా ప్రకారం దరఖాస్తుల సర్వేను క్షేత్ర స్థాయిలో చేస్తున్నాము. దీనికి తోడు తాజాగా రేషన్ కార్డుల్లో మార్పుల కోసం దరఖాస్తుల సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు అవసరమైన పరిశీలన జరుగుతోంది.

నిధులు మంజూరు చేయండి

ఎమ్మెల్యేను కలిసి విన్నవించిన విశ్వబ్రాహ్మణులు

కొడిమ్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లి గ్రామ విశ్వబ్రాహ్మణులు సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ పూడూర్ సింగిల్ విండో డైరెక్టర్ నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంకు కరీంనగర్‌లో సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. సంఘ భవనం లేకపోవటంతో తాము ప్రతి నెల ఇబ్బందులు ఎదుర్కొంటు సమావేశాలు నిర్వహించుకుంటున్నట్లు వినతి పత్రంలో తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు గంగాదర సత్యం, వెం కటరమణ, అనిల్, నరేష్, వినయ్, గణేష్ ఉన్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

రాయికల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించే ఎమ్మార్పీఎస్ సన్నాహక సమావేశాన్ని విజయ వంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొబ్బల వేణుగోపాల్ అన్నారు. మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. మందకృష్ణ మాదిగ సారథ్యంలో వెయ్యి గొంతులు, లక్ష డప్పులతో హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఈ నెల 24న జగిత్యాలలో నిర్వహించే సన్నాహక సమావేశంలో మందకృష్ణ మాదిగ పాల్గొన్న దృష్ట్యా ప్రతి గ్రామం నుంచి డప్పు కళాకారులు, సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి సురేష్, నరేష్ ఉన్నారు.

ఆదర్శ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025-2027 సంవత్సర అభివృద్ధి నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగినట్లు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా ముత్యాల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పులాటి రాఘవులు, కోశాధికారిగా చెన్న శ్రీనివాస్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు రాంప్రసాద్, మహేష్, సతీష్ గౌడ్, రాకేష్, జగయ్య, రామకృష్ణ శాస్త్రిలు తెలిపారు. నూతనంగా ఎంపికయిన కమిటీనీ కాలనీ వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శనగర్ అభివృద్ధి కమిటి గౌరవ అధ్యక్షుడు బూర్గు రామస్వామి గౌడ్, మాజీ అధ్యక్షుడు కిరణ్, కాలనీ వాసులు వెంకటరమణలతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీది నియంత పాలన

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని నియంత పాలన అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైనట్లు విమర్శించారు. హామీల అమలు కోసం ప్రశ్నిస్తే చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై దాడి చేశారని అన్నారు. కేంద్రం పసుపు బోర్డు నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడం శుభసూచకమని ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగా బోర్డు ఏర్పాటుకు మోక్షం లభించిందన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదని పేర్కొన్నారు. ఆరు గ్యా రంటీలు అమలు చేసేదాకా బీఆర్ఎస్ పార్టీ పోరాటం సాగిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, బాల్క సంజీవ్, తిరుజానీ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజేశ్వర్‌రా వుపేట గ్రామంలోని పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సేమ్మేళనం సమా వేశం నిర్వహించుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ చదువులు పూర్తి చేసుకుని 12 ఏం డ్లు గడిచిన తరువాత పూర్వ విద్యార్థులు అంతా ఒక్కటై గురువులను గుర్తుం చుకుని గౌరవించుకోవడంతో పాటు వారు చూపుతున్న ప్రేమ ఎప్పటికి మర్చి పోలేమన్నారు. తాము చదువు చెప్పిన విద్యార్థులు మంచి స్థాయిలో స్థిరపడ డం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు తాము చదువుకున్న రోజుల్లో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనంగా ఏర్పడ్డ పూర్వ విద్యార్థులు

నల్ల పోచమ్మ ఆలయానికి బోర్‌వెల్ ఏర్పాటు

ధర్మపురి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాజారం గ్రామంలో గల నల్ల పోచమ్మ ఆలయానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బోర్‌వెల్ మంజూరు చేశారు. మాజీ సర్పంచ్ రంగు మమత-అశోక్ నల్ల పోచమ్మ ఆలయం వద్ద తాగు నీటి సమస్య ఉందని లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకవెళ్లారు. దీంతో ఆయన స్పందించి వెంటనే బోర్‌వెల్ ఏర్పాటు చేయించారు. బోర్‌వెల్ మంజూరు చేయించినందులకు లక్ష్మణ్‌కుమార్‌కు గ్రామ మాజీ సర్పంచ్ రంగు మమత-అశోక్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఏదులాపురం మహేందర్, ఎరవేని భాస్కర్, రత్నాకర్, రమేష్, శంకర్, సత్తయ్య గునిశెట్టి కాశీనాథం, అశోక్, సాయికుమార్, మురళి, గంగారాం, నాగరాజు, జయకర్, తిరుపతి, రాజన్న, సంతో ష్, నారాయణ, తిరుపతి, శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



విప్ లక్ష్మణకుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పాఠశాలల బలోపేతానికి కృషి

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

రాయికల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తాను గెలిస్తే పాఠశాలల బలోపే తానికి మరింత కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. రాయికల్ పట్టణంలో ఆదివారం పర్యటించిన ఆయన విస్డమ్ హైస్కూల్‌లో గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల సంఘం సభ్యులతో సమావేమయ్యారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల మద్దతుతో పాటు మండలంలోని పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అనంతరం రాయికల్ మండల ట్రస్మా సభ్యులు పూలమాల, శాలువాతో శేఖర్ రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రావు, గౌరవ అధ్యక్షుడు బోగ రవి ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, బాలె శేఖర్, కైరం సత్యం, వేణుగోపాల్ రావు, రవీందర్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

- రాయికల్ క్రికెట్ లీగ్ మూడవ సీజన్ ప్రారంబోత్సవంలో ముఖ్య అతిథిగా యాదగిరి శేఖర్‌రావు పాల్గొని ప్రథమ బహుమతిని స్పాన్సర్ చేశారు. అనంతరం టాస్ వేసి మొదటి మ్యాచ్‌ను ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, మహేందర్, స్పాన్సర్ డాక్టర్ ఉదయ్, కిరణ్‌రెడ్డి, ఫ్రాంచైజీస్ మ్యాకల రమేష్, మోర రామ్మూర్తి, బత్తిని నాగరాజు, పాల్గొన్నారు.

లక్ష గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమం విజయవంతం చేయాలి

కోరుట్ల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : లక్ష గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ కోరారు. ఆదివారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో లక్ష గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించి జిల్లా అధికార ప్రతినిధిగా కథలాపూర్ మండలానికి చెందిన తెడ్డు శేఖర్ మాదిగను ప్రకటించారు. గ్రామానికి విచ్చేసిన బెజ్జంకి అనిల్, సురుగు శ్రీనివాస్, బుచ్చన్న, తెడ్డు శేఖర్‌లకు స్థానిక అంబేడ్కర్ సంఘ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బెజ్జంకి అనిల్ మాట్లాడారు. మందకృష్ణ మాదిగ సుమార్ 30 సంవత్సరాల పోరాటం చేసి ఎసీ వర్గీకరణను సాధించాడని వాటి అమలుకు ఈ 15 రోజుల చేస్తున్న దీక్ష ఒకెత్తన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యంగ ఫలాలు అందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అధికారుల సర్వే

ధర్మపురి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట, రాజారం, జైనా, రాయపట్నం గ్రామాలతో పాటు ధర్మపురి పట్టణంలో రైతు భరోసాపై ఆదివారం అధికారులు సర్వే చేపట్టారు. అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి సేద్యానికి యోగ్యం కాని, ఇళ్లు ఉండి పట్టాదా రు పాసు పుస్తకాలు కలిగి ఉన్న భూములను గుర్తించారు. అలాగే భూముల్లో పెట్రోల్ బంక్‌లు, రైస్‌మిల్లులు, కోళ్ల ఫారాలు ఉన్నాయా లేవా అనేవి కూడ తెలుసుకున్నారు. ఎక్కడైన ఉంటే ఆ భూములను గుర్తించి మార్కింగ్ చేశారు. సర్వేలో ధర్మపురి మండల వ్యవసాయ అధికారిణి సింధూజ, ఆర్ఐ శ్రీనివాస్ యాదవ్, భాస్కర్ రావు, ఏఈవోలు అజయ్‌కుమార్, నవ్య, సర్వేయర్ పర మేశ్వర్ పాల్గొన్నారు.

మానుకోట సభకు బయలుదేరిన ఉద్యమకారులు

జగిత్యాల అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మానకోటలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల మహా పాదయాత్రతో పాటు అమరవీరుల స్థూపం దగ్గర జరిగే సభకు జిల్లా నుంచి ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జవ్వాజి శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం బయలుదేరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన వారు సంఘటితంగా ఏర్పడి ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కలిసి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం జగిత్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భారతపు లింగారెడ్డి, తుమ్మనపెల్లి నరేష్ పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు

రాయికల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని మార్కండేయ దేవాలయ ఆవరణలో ఆదివారం పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన జక్కుల చంద్రశేఖర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, యువజన సంఘం అధ్యక్షుడు సామల సతీష్, కార్యదర్శులు మామిడాల లక్ష్మీనారాయణ, ఆడెపు రాజీవ్, మ్యాకల రమేష్, శ్రీరాముల సత్యనారాయణ, కోశాధికారి చిలివేరి నర్సయ్య, ఉపాధ్యక్షుడు సింగని సతీష్, కార్యదర్శి అనుమల్ల చంద్రతేజ, ప్రెస్ క్లబ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, హనుమాన్ దేవాలయ చైర్మన్ దాసరి గంగాధర్, సలహాదారులు సామల్ల గోపాల్, ఆడెపు నర్సయ్య, పోపా అధ్యక్షుడు ఎలిగేటి రాజా కిషోర్, కార్యదర్శి గుట్ట సత్యనారాయణ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఆలయ ఆవరణలో మొక్కలు నాటిన దీక్షపరులు

మల్లాపూర్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రంలోని కనుక సోమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో 108 రకాల మొక్కలను దీక్షపరులు నాటారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు సంగపెల్లి సుధాకర్‌శర్మ సహకారంతో స్థానిక పురోహితులు బాల్యపల్లి సుధాకర్‌శర్మ, తారాదేవి దంపతుల సంకల్పంతో వారి సోదరులు బాగేపల్లి ప్రభాకర్‌శర్మల మంత్రోచ్చరణల మధ్య ఆదివారం ఆలయ ఆవరణలో మొక్క లను నాటారు. ముఖ్యంగా స్వామి ఇష్టమైన ఏకబిల్వ, బహుబిల్వ, ఉసిరిక, సంపంగి, మహాబిల్వ వృక్షాలను దీక్షపరులచే నాటించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ సంఘ గంగారాజం, కమిటీ సభ్యులు శివరామ కిషన్, శివా దీక్షపరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన గోసంగి కులస్థులు

రాయికల్, జనవర 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్‌లోని గోసంగి కులస్థులు కరీంనగర్‌లో రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోసంగి కులస్థులకు ప్రభుత్వ పథకాల్లో ప్రత్యేక రాయితీలతో పా టు నిరుపేద వర్గాలకు రుణాల సౌకర్యం కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో స్థానం కల్పించాల, పెన్షన్లు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కుశన పెల్లి మహేందర్, కార్యదర్శి పెద్ద నర్సయ్య, సభ్యులు కలమడుగు స్వామి, తిరుపతి, రమేష్, భూమేష్, మల్లేష్, వెంకటేష్, రాఘవేంద్ర, నవదీప్, గంగరాజం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసమిత్రుల వార్షికోత్సవం

జగిత్యాలరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలంలోని ధరూర్ శివారులో గల రెడ్డి ఫంక్షన్‌హాల్ నందు ఆదివారం శ్రీనివాస మిత్రుల సంఘం మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈసందర్భంగా ఈ కార్యక్రమానికి జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్, ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. తలసేమియా బాధితులకు రక్త దానం చేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈకార్యక్రమంలో శ్రీని వాసుల గ్రూప్ వాట్సప్ అడ్మిన్ రాజేశుని శ్రీనివాస్, వైద్యులు ఎల్లాలశ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పిట్టలశ్రీనివాస్, పాక శ్రీనివాస్, శ్రీనివాస్‌శర్మ, గాజుల శ్రీనివాస్, సంఘసభ్యులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న సభ్యులు

క్రీడలు స్నేహభావాల్ని పెంపొందిస్తాయి

సీనియర్ సివిల్ జడ్జి డి నాగేశ్వరావు

మెట్‌పల్లి టౌన్, జనవరి19 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందింపజేస్తాయని మెట్‌పల్లి సినియర్ సివిల్ కోర్టు జడ్జి డి.నాగేశ్వరావు అన్నారు. ఘనతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు క్రీడలు ఆడటం వల్ల మానసికంగా, ఉత్సహంగా కొనసాగుతాయని అన్నారు.

న్యాయవాదులు బీజీగా ఉండటం వల్ల క్రీడలు ఆడి కాసేపు మానసిక ప్రశాంతతను పొందవ చ్చన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అరుణ్ కుమార్, బార్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, ఉపాధ్య క్షులు ఎల్ముల రాంబాబు, న్యాయవాదులు వేణుగోపాల్, శ్రీనివాస్, ఆనంద్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు

పసుపు బోర్డు చైర్మన్‌ను కలిసిన బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ పసుపు బోర్డు మొదటి చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డిని అంకాపూర్‌లోని తన నివాసంలో జగిత్యాల బీజేపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నాయకులు రాంరెడ్డి, కల్లెడ ధర్మపురి, ఆముద రాజు, సాంబారి కళావతి, ఆకుల మహేష్, దుర్శెట్టి మమత, గాదాసు రాజేందర్, పాత రమేష్, కవిత, పద్మ, భానుప్రియ, లావణ్య, తిరుపతి, తిరుపతి నాయక్, సాయిరాజ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా ఎంపికైన బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె గంగారెడ్డిని ఆదివారం మండల బీజేపీ నాయకులు సన్మానించారు. మండల బీజేపీ అధ్యక్షుడు, చిన్నమెట్‌పల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు పంచరి విజయ్ కుమార్ నాయకులు నరేందర్, అంబల్ల సుదర్శన్, వెంకట్ రెడ్డి, చల్ల లింగారెడ్డి, గుగ్గిల్ల తుక్కారాం గౌడ్, తోట లింగారెడ్డి, రాజేందర్, తుక్క రెడ్డి, భూమానందం, ఆనంద్, సతీష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నగదు అందజేత

కోరుట్ల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని అయ్యప్ప ఆలయ అభివృద్ధికి నగదును మాజీ ఎంపీ పీ తోట నారాయణ అందజేశారు. ఆదివారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని తన స్వగృహంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అంబటి శ్రీనివాస్, గడ్డం మధు, రవిగౌడ్, తులశీ కృష్ణ, తోట రాజు, రమేష్‌లకు రూ. 25,116 నగదును మాజీ ఎంపీపీ తోట నారాయణ-లింబక్క దంపతులు అందజేసారు. దేవాలయ అభివృద్ధికి సహకారం అందించిన మాజీ ఎంపీపీ తోట నారాయణ-లింబక్క దంపతులను దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

సారంగాపూర్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పొంపర్తి లింగన్న అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్ లింగన్న కుమారుడు మహేష్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ తేడేటి శేఖర్‌గౌడ్, మర్రిపెల్లి రాజేశం, నాయకులు ఉన్నారు.